క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి



వసతిగృహంలో జరుగుతున్న ఫ్లోరింగ్ నిర్మాణ పనులు

దొర్నిపాడు: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న మరమ్మతులు, నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఏఈ గౌస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. రూ.29 లక్షలతో ఫ్లోరింగ్, గోడలు, సీలింగ్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెచ్‌డబ్ల్యూఓ రాముడు ఏర్పాట్లు చేసినట్లు ఏఈ చెప్పారు.

రస్తా ఏర్పాటు



ఉయ్యాలవాడలో సిమెంట్ రోడ్డు వేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: స్థానిక గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి (ఎస్‌డబ్ల్యూపీసీ) వెళ్లేందుకు రహదారి నిర్మాణం కోసం మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.10 లక్షలు మండల పరిషత్ నిధులు కేటాయించారు. ఈ మేరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కాంట్రాక్టర్ ప్రారంభించారు. గ్రామంలోని చెత్త చెదారాన్ని, గృహ వ్యర్థాలను షెడ్‌కు తరలించేందుకు రస్తా సౌకర్యం లేక నిత్యం పారిశుద్ధ్య కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం కంప చెట్లను తొలగించి సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయితే రహదారి సమస్య తీరుతుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్ కమిషనర్



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటదాసు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటదాసు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గిద్దలూరులో పని చేస్తున్న ఆయనను ఉన్నతాధికారులు నంద్యాల మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాను, కమిషనర్ నిరంజన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

భూముల రీసర్వేపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వీఆర్వోలు, సివిల్ అసిస్టెంట్లు

చాగలమర్రి: జిల్లాలోని 28 గ్రామాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీసర్వేపై నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా గురువారం సమీక్ష జరిపారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వేయర్లు, సివిల్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేసినట్లు డీటీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం భూముల రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, సర్వేను పకడ్బందీగా చేపట్టేలా జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారన్నారు.

ఇది సంపన్నుల బడ్జెట్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

నంద్యాల (న్యూటౌన్): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంపన్నుల కోసమేనని, సామాన్యుల సంక్షేమం మరిచి వారిపై భారం మోపడమే పనిగా పెట్టుకొందని సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేశారు. సీపీఎం నంద్యాల మండల కార్యదర్శి వెన్న బాలవెంకట్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు చౌడప్ప, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ వ్యవసాయం అనుబంధ రంగాలకు, ఉపాధిహామీ పథకానికి కేటాయింపులు పెంచాలన్నారు. దళిత, గిరిజన సంక్షేమానికి, మహిళా సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. సామాన్యులపై భారం మోపే చర్యలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పేద ముస్లిం యువతుల వివాహాలకు ఆర్థిక సాయం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంజుమన్ అధ్యక్షుడు అబ్దుల్ ఖుద్దూస్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీ నాటికి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంజుమన్ మసీదులో దరఖాస్తుతో పాటు బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు, ఫొటోలు జత చేసి అందజేయాలని చెప్పారు. ముస్లిం యువతులకు వివాహం రోజు రూ.50వేల చెక్కును అందజేస్తామని చెప్పారు.

గోవిందా..గోవింద



టి.లింగదిన్నెలో ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు

రుద్రవరం: పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వామిని పల్లకీలో కొలువుంచి గురువారం టి.లింగందిన్నె గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు గోవిందా.. గోవింద అంటూ స్మరిస్తూ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భుజంపట్టి స్వామి వారి పల్లకీని తెలుపు మీద నుంచి మరో తెలుపు మీదకు మోశారు. స్వామివారి పల్లకీ రాకతో గ్రామం అంతా కొత్త పాత బంధువులతో కళకళలాడుతోంది. గ్రామంలో పూజా కార్యక్రమాలు ముగియగానే రాత్రికి స్వామివారి పల్లకీని ఆర్.నాగులవరం గ్రామ శివారులోని తెలుపు మీదకు చేర్చారు.

కళతప్పిన కుందూ



క్రిష్టిపాడు వద్ద కుందూ నదిలో నీరు తగ్గడంతో నెర్రలిచ్చిన భూమి

దొర్నిపాడు: ఇన్నాళ్లుగా గలగలా పారిన కుందూ నదిలో రోజురోజుకూ నీటి మట్టం తగ్గి కళతప్పుతోంది. నది ఒడ్డున ఒండ్రు మట్టి పగుళ్లు ఇవ్వడంతో కరువు ఛాయలుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నీటి మట్టం తగ్గి నడి ఏరులో స్వల్పంగా పారుతుండంతో రైతులు కలవరం చెందుతున్నారు. తీరం కింద సాగుచేసిన వరి పంటలు చేతికి రావాలంటే మార్చి నెలాఖరు వరకు సాగునీరు అందాల్సి ఉంది. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కుందూ పూర్తిగా ఎండిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కుందూ నదిలో ఎంతవరకు నీరు పారుతుంతో ప్రశ్నార్థకంగా మారింది.

పశువుల ఎరువుకు గిరాకీ



దొర్నిపాడు నుంచి లారీలో కర్ణాటకకు తరలిస్తున్న ఎరువు

దొర్నిపాడు: గత కొన్నేళ్ల నుంచి పశువుల ఎరువుకు డిమాండ్ పెరిగింది. మండలంలోని రామచంద్రాపురం, వెంకటేశ్వరనగరం, క్రిష్టిపాడు, దొర్నిపాడు, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె, అమ్మిరెడ్డి నగరం గ్రామాల నుంచి పేడ దిబ్బలను రూ.వెయ్యి నుంచి రూ.వేలకు కొలుగోలు చేసి లారీలు, ట్రాక్టర్లలో అనంతపురం, కర్ణాటక ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఒక ట్రాక్టరు ట్రిప్పుకు రవాణా, కొనుగోలు ఖర్చులు పోనూ రూ.7 వేల వరకు మిగులుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కొంత మంది పెద్ద లారీల్లో ఎరువును తరలించి పండ్ల తోటల రైతులకు టన్నుల ప్రకారం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువులతో పండించిన పండ్లకు మార్కెట్లో డిమాండ్ ఉండటంతో ఎన్నడు లేని విధంగా ఎరువుకు ఆదరణ పెరుగుతోంది.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

- యూరియాను అధిక ధరకు అమ్మడంపై నిలదీత
- ఏఓ మామూళ్లు తీసుకుంటూ పట్టించుకోవడం లేదని ఆరోపణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల వారు యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ ద్వారా రూ.420 అధిక ధరకు విక్రయిస్తున్నారని, దీనిపై ఏఓ రంగనేతాజీ దృష్టికి తీసుకెళితే ఆయన దుకాణదారులకు సమాచారం ఇవ్వడంతో వారు అప్రమత్తమై స్టాకును ఇతర ప్రాంతానికి తరలించారని డి.వనిపెంట సర్పంచ్ బాలీశ్వరరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అద్వర్యంలో ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఓ మాట్లాడుతుండగా సర్పంచ్ బాలీశ్వరరెడ్డి అడ్డుకొని యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు అమ్మడంపై నిలదీశారు. ఓ గోడౌన్‌పై నామమాత్రంగా దాడి చేసి 113 బస్తాల యూరియా సీజ్ చేశారని, ఆర్బీకేల్లో కొనుగోలు చేసిన యూరియా బస్తాలను దుకాణాల్లో ఎందుకు నిల్వ ఉంచుతున్నారని ప్రశ్నించారు. వాటిపై విచారణ జరపాలని పట్టుబట్టారు. పంచాయితీ రాజ్ ఏఈ కొండారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో రూ.2.50 కోట్ల నిధులతో 3.5 కి.మీ మేర సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రూ.29 లక్షలతో చిన్నవంగలి గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతు పనులు చేపట్టామని మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. ఈఓపీఆర్డీ తాహెర్ హుసేన్, విద్యుత్ ఏఈ వెంకటరమణ ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. చిన్నవంగలి ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ.. ఐదు నెలల క్రితం గ్రామంలోని ఆర్డీకే వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికాగా ఇప్పటివరకు బాగు చేయలేదని, దీంతో విద్యుత్ సరఫరా లేక ఆర్బీకే ప్రారంభానికి నోచుకోలేదని సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఏఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీలు ముల్లా రఫీ, ఆశీర్వాదమ్మ, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, నరసింహులు, ఎం.ఫయాజ్, ఎద్దుల రాజేశ్వరి, సర్పంచ్‌లు బాలీశ్వరరెడ్డి, షరీఫ్, మౌలిబాష, ప్రతాప్‌రెడ్డి, ముడియం శివమ్మ, ఉప సర్పంచ్ వెంకట సుబ్బారెడ్డి, ప్రభుత్వ అధికారులు ఎంఈఓ అనురాధ, డీటీ విజయ్‌కుమార్, ఏఈ జగ్గయ్య, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అడవిలో నిప్పు రాజేయొద్దు

రుద్రవరం: మహాశివరాత్రి ఉత్సవాలకు నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఉల్లెడ మల్లేశ్వర స్వామి సన్నిధికి వెళ్లే భక్తులు అడవిలో నిప్పు రాజేయవద్దని చెలిమ రేంజి పెద్దకంబలూరు సెక్షన్ అధికారి కిషోర్ సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. మండలంలోని పెద్దకంబలూరు, శ్రీరంగాపురం, ఎల్లావత్తుల, డీ.కొట్టాల, టీ.కొట్టాల, కోటకొండ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఉల్లెడ మల్లేశ్వరస్వామి దర్శనానికి వస్తుంటారన్నారు. అడవిలో వెళ్లి వచ్చే సమయంలో ఎక్కడబడితే అక్కడ నిప్పు రాజేయవద్దన్నారు. చిన్న నిప్పు రవ్వ పడినా అడవిలో మంటలు చెలరేగి వృక్ష సంపద కాలి బూడిద అవుతుందన్నారు. పచ్చదనం కాలిపోవడంతో వాతావరణ సమతుల్యత కొరవడుతుందన్నారు. అలాగే అడవిలో నివసించే చిన్న, పెద్ద జీవరాశులు సజీవదహనం అవుతాయని, వన్య ప్రాణులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. శివ భక్తులు ఈ విషయాన్ని గుర్తించుకొని సహకరించాలని కోరారు. అలాగే ప్లాస్టిక్ వస్తువులను అడవిలోకి తీసుకెళ్లవద్దని సూచించారు. భక్తాదులందరూ అటవీ నిబంధనలు పాటించాలన్నారు. పెద్దకంబలూరు, కోటకొండ బీట్ల సిబ్బంది ఉన్నారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి



నంద్యాల ఎల్ఐసీ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల (న్యూటౌన్): ఎల్ఐసీ సంస్థ కోసం పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నంద్యాల కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బ్రాంచ్ అధ్యక్షుడు వీఎస్ఆర్ శుక్ల ఆధ్వర్యంలో జరిగిన ఒక గంట దేశ వ్యాప్త సమ్మె కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే ఉన్నత విద్యావంతులైన సిబ్బంది అవసరమన్నారు. హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువతను నియమించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జవాబుదారీతనం లేని ఔట్సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలే పరిష్కారమన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): దేశ వ్యాప్తంగా ఆర్యవైశ్యులకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని నంద్యాల బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కొట్టి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, మేడా మురళీధర్, బింగుమళ్ల శ్యాం, నెరవాటి రవికుమార్, శేషయ్య, రమేష్‌బాబు, శోభారాణి, ఇందుమతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాలను కమ్మేసిన పొగమంచు

ముంచుతున్న మంచు



పెద్దబోధనం గ్రామంలో చలిమంట కాచుకుంటున్న ప్రజలు

చాగలమర్రి: ఖరీఫ్‌లో పంటలు పోయినప్పటికీ రబీ ఆదుకుంటుందనే ఆశతో పంటలు సాగు చేసిన అన్నదాతలకు ఈ సీజన్ కూడా నష్టాలనే మిగిల్చేలా ఉంది. ఈ ఏడాది చలి కాలంలో మంచు విపరీతంగా కురిసింది. వేసవి కాలం వాతావరణం మొదలైనప్పటికీ గత మూడు రోజులుగా సాయంత్రం నుంచే పొగమంచు ప్రారంభమై తెల్లవారుజాము నాటికి తీవ్రంగా మారుతోంది. దీంతో ఉదయం ఏడు గంటలు దాటినా మంచు తొలగడం లేదు. దీంతో రబీలో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, తెల్లనువ్వులు, పెసర, వరి, కొర్ర, సజ్జ, శనగ పంటలకు చీడపీడలు చుట్టుముట్టుతున్నాయి. వాటిని అదుపు చేసేందుకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోతోందని రైతులు వాపోతున్నారు.



18వ నంబరు జాతీయ రహదారిపై వాహనాలు కనిపించనంతగా పొగమంచు

పేదల స్థలాలను లాక్కుంటే ప్రతిఘటన తప్పదు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న శిల్పా రవి



కానాల గ్రామ లబ్ధిదారులతో మాట్లాడుతున్న శిల్పా రవి

- విష సంస్కృతికి తెరతీసిన కూటమి సర్కారు
- అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి ధ్వజం

నంద్యాల(అర్బన్): ప్రభుత్వాలు పేదల పక్షాన నిలవాల్సింది పోయి వారి ఇళ్ల స్థలాలను లాక్కుంటే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల మండలం కానాల గ్రామ పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలను కూటమి నాయకులు లాక్కుంటామంటూ కొత్త సంస్కృతికి తెరతీశారని మండిపడ్డారు. ఇళ్ల పట్టాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలంటూ శిల్పా రవి గురువారం కానాల గ్రామ లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ రాజకుమారితో మాట్లాడిన అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గూడులేని పేదల సొంతింటి కలను నెరవేర్చాలని నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకు ప్రత్యేకంగా జగనన్న కాలనీలను ఏర్పాటుచేసి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని గుర్తు చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పట్టాలు పంపిణీ చేసి పేదల పక్షాన నిలిచారన్నారు. అధికార యంత్రాంగం సిక్స్ స్టెప్ వ్యాల్యుయేషన్ ఆధారంగా స్థలాలు అందజేశారన్నారు. స్థానిక నేతలు ఇళ్ల పట్టాలను లాక్కుంటూ లబ్ధిదారులను భయాందోళనకు గురిచేస్తున్నారని, స్థలాలు ఉండాలంటే డబ్బు ముట్టజెప్పాలని డిమాండ్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే పట్టాలు లాక్కునే సంస్కృతి గతంలో ఎప్పుడూ లేదని, కూటమి ప్రభుత్వం విష సంస్కృతిని అనుసరిస్తే భవిష్యత్‌లో ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, ఎప్పుడూ పరిస్థితులు ఒకేలా ఉండవని మరువరాదన్నారు. జిల్లా అధికారులు సమస్యను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్, నాయకులు విజయశేఖర్ రెడ్డి, బసవేశ్వరరెడ్డి, జగదీశ్వరరెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు నరసింహారెడ్డి వర్ధంతి సభ



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహం

ఉయ్యాలవాడ: దేశంలో తెల్లదొరల నిరంకుశ పాలనపై మొట్టమొదటి సారిగా తిరుగుబాటు బావుటా ఎగరవేసిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి గడ్డ సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్త రవీంద్రనాథ్, తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): సివిల్ సప్లయ్ హమాలీ కూలి రేట్లు పెంచాలని కోరుతూ హమాలీ కార్మికులు సివిల్ సప్లయిస్ గోదాము ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి మహమ్మద్‌గౌస్, యూనియన్ కార్యదర్శి గోపాల్, స్వాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇంత వరకు కూలి రేట్లను పెంచలేదన్నారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం మార్చి 7న విజయవాడలోని డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికలు నిర్వహించండి

నంద్యాల(న్యూటౌన్): విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించాలని నంద్యాల విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు చిన్న సుబ్బరాయుడు, రాజగోపాల్, మేకల లింగస్వామి కోరారు. ఈమేరకు గురువారం రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సభ్యులకు జరుగుతున్న అన్యాయంపై మంత్రికి వివరించారు. రామసుబ్బయ్య, గఫ్ఫార్, మల్లారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఖాశీంవలి పాల్గొన్నారు

ఉద్యోగుల సంఘం బలోపేతానికి కృషి చేయాలి



తెలుగుగంగ ఉద్యోగులతో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

నంద్యాల (న్యూటౌన్): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బలోపేతానికి కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టగా పట్టణంలోని తెలుగు గంగ ప్రాజెక్ట్ సర్కిల్‌లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు సభ్యత్వం తీసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, కార్యవర్గ సభ్యుడు తిరుపాలయ్య మాట్లాడుతూ తెలుగుగంగ ప్రాజెక్టు ఉద్యోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సహాధ్యక్షుడు శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఫకృద్దీన్,ఏసురత్నం సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మాలల యుద్ధ గర్జనను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): మాలలందరినీ ఐక్యపరిచి రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకుంటామని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన కర్నూలులో జరిగే మాలల యుద్ధ గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీలకు కల్పించిన రిజర్వేషన్ ఫలాలను విచ్ఛిన్నం చేయడానికి కూటమి ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్‌ను బూచీగా చూపిందన్నారు. మాలలంతా ఐక్యమై రిజర్వేషన్లు కాపాడుకుంటామన్నారు.మాల మహాసభ అధ్యక్షుడు కృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, నంద్యాల పట్టణ అధ్యక్షుడు పుష్పరాజు పాల్గొన్నారు.

27న కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: యంబాయి గ్రామంలోని పార్వతి భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 27న అంతర్రాష్ట్ర హోమ్ టీమ్స్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. 26న నందికోళసేవ, 27న స్వామివారి కల్యాణోత్సవం, 28న ప్రత్యేక పూజలు, మార్చి 1న వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.10 వేలు, రూ. 8వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున నగదు బహుమతులతోపాటు క్వార్టర్ ఫైనల్ నుంచి బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్‌కు రూ. 2వేలు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 8897717172, 8074372584 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శాంతినికేతన్ సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం గురువారం క్యాలికులేషన్ కార్నివాల్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పైథాగరస్ సిద్ధాంతం, టైప్స్ ఆఫ్ ట్రయాంగిల్స్, యాంగిల్స్ తదితర వాటిని వివరించారు. విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ మ్యాథ్స్ అనేది ఒక సబ్జెక్టులా కాకుండా నిత్య జీవితంలో భాగంలా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

27న గొల్లపల్లి బుగ్గలో బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని గొల్లపల్లి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 27న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పళ్లలోపు వృషభాలకు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతగా నిలిచిన వారికి రూ. 25,000 నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆ తర్వాత వరుసగా రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. మొత్తం 12 బహుమతులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 88973 44886, 99858 22980 నంబర్లను సంప్రదించాలన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



లబ్ధిదారుల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

ఉయ్యాలవాడ: స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీలకు 55 యూనిట్లు, కాపు 4, ఆర్యవైశ్య, కమ్మ కులాలకు ఒక్కొక్కటి, రెడ్డికి 2 యూనిట్లు మంజూరయ్యాయి. రుణాలు పొందేందుకు 20 గ్రామ పంచాయతీల నుంచి 244 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి రోజు 30 మంది లబ్ధిదారులు హాజరైనట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఉయ్యాలవాడ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ హరీష్, అల్లూరు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ నరసింహుడు హాజరై దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులు స్థాపించే యూనిట్లపై ఆరా తీశారు. 21న కాకరవాడ, ఒంటిద్దుపల్లె, హరివరం, నర్సిపల్లె, సర్వాయిపల్లె, కొండుపల్లె, తుడుమలదిన్నె గ్రామాలకు చెందిన లబ్ధిదారుల దరఖాస్తులను సంజామల కెనరా బ్యాంకు, ఆళ్లగడ్డ ఎస్‌బీఐ, కోవెలకుంట్ల యూనియన్, నొస్సం ఏపీజీబీ, మాయలూరు కేవీబీ బ్యాంకుల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించవలసి ఉందన్నారు.